క్లుప్తంగా

కొనసాగుతున్న ప్రతిష్ఠా మహోత్సవాలు



నందిగామ: పట్టణంలోని కృష్ణ బలిజనగర్‌లో శివ నాగేంద్ర స్వామి ఆలయంలో విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవాలు ఘనంగా కొనసాగుతున్నాయి. ఆలయంలో ప్రతిష్ఠించబోయే విగ్రహాలకు శుక్రవారం పలు రకాల విశేష పూజలు, జలాధివాసం, ధాన్యాధివాసం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు రకాల హోమాధి కార్యక్రమాలు జరిగాయి. ఆయా కార్యక్రమాల్లో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

వ్యర్థాలు రోడ్లపై వేయొద్దు
మున్సిపల్ కమిషనర్



జగ్గయ్యపేట అర్బన్: వ్యర్థాలను రోడ్లపై పడవేయవద్దని మున్సిపల్ కమిషనర్ సీహెచ్.మల్లేశ్వరరావు అన్నారు. వార్డు పర్యటనలో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాలను పరిశీలించిన ఆయన కొన్ని ప్రాంతాల్లో రోడ్లపై వ్యర్థాలు పడవేయడం గమనించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఈ విధంగా మెటీరియల్, చెట్లను తొలగించడం మున్సిపాలిటీ పారిశుద్ధ్య సిబ్బందికి అధిక భారం అవుతుందన్నారు. వీధుల్లో వ్యర్థాలను డంప్ చేసిన వారిపై పురపాలక సంఘ ప్రజారోగ్య చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. ఆనంద సాయి ఆలయం వద్ద ఈఎల్ఎస్ఆర్ నీళ్ల ట్యాంకును పరిశీలించారు. పంపు ఆపరేటర్లతో ఎప్పటికప్పుడు వాల్స్ సరిచూసుకోవడం, బ్లీచింగ్‌తో క్లీన్ చేయడం, లీకులు లేకుండా చూడటం, మున్సిపల్ ఏఈ, డీఈఈలను ఆదేశించారు.

112 మందికి వైద్య పరీక్షలు



నందిగామ(చందర్లపాడు): ప్రభుత్వం ప్రజారోగ్యానికి పెద్దపీట వేస్తోందని చందర్లపాడు సహకార సంఘ అధ్యక్షుడు రాయల జానకిరామయ్య అన్నారు. చందర్లపాడులో శుక్రవారం వైఎస్సార్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా మూడో విడత వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఈ శిబిరాన్ని ప్రారంభించిన జానకిరామయ్య మాట్లాడుతూ గత ఏ ప్రభుత్వం లోనూ లేని విధంగా ప్రస్తుత ప్రభుత్వం ప్రజారోగ్యంకి పెద్దపీట వేస్తోందన్నారు. కార్పొరేట్ వైద్య సేవలను పేదవారికి ఉచితంగా అందిస్తోందన్నారు. ఇప్పటికే కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా ఎంతో మందికి ఉచితంగా కంటి ఆపరేషన్లు చేయించిందన్నారు. కాగా ఈ శిబిరం ద్వారా 112 మందికి కంటి పరీక్షలు నిర్వహించినట్లు ప్రాజెక్ట్ అధికారిని శేషకుమారి తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ సభ్యుడు కే సత్యనారాయణ, సర్పంచ్ కె.పున్నమ్మ, పలువురు పార్టీ నాయకులు, వైద్య ఆరోగ్యశాఖ సిబ్బంది పాల్గొన్నారు.

ఇంటర్ ప్రవేశం కోసం దరఖాస్తు చేసుకోండి

రెడ్డిగూడెం: మద్దులపర్వ ఆదర్శ పాఠశాల(మోడల్ స్కూల్)లో 2023–24 విద్యా సంవత్సరానికి గాను ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరంలో విద్యార్థుల ప్రవేశం కోసం ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆదర్శ పాఠశాల ప్రిన్సిపాల్ ఏ వీరరాజు శుక్రవారం తెలిపారు. ఆదర్శ పాఠశాలలో ఎంపీసీ, బైపీసీ, సీఈసీ, ఎంఈసీ గ్రూపులలో ఉచిత విద్య పొందగోరు వారి దరఖాస్తులు స్వీకరిస్తున్నామని పేర్కొన్నారు. సంబంధిత జిల్లాలో ప్రభుత్వ, ప్రైవేటు గుర్తింపు పొందిన పాఠశాలలో పదో తరగతి ఉత్తీర్ణులైనవారు ఈనెల 22వ తేదీ నుంచి జూన్ ఏడో తేదీలోపు దరఖాస్తు చేసుకోవాలని తెలిపారు. ప్రవేశం కోసం ఓసీ, బీసీ, ఈడబ్ల్యూఎస్‌లు రూ. 200లు, ఎస్సీ, ఎస్టీలకు రూ. 150 రుసుంతో దరఖాస్తు చేసుకోవాలని పేర్కొన్నారు.

రైతు సంక్షేమానికి సీఎం జగన్ కృషి

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- రైతులకు యంత్ర పరికరాల పంపిణీ



రైతులకు యంత్ర పరికరాలు అందించి ట్రాక్టర్‌ను ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

నందిగామ టౌన్: రాయితీపై యంత్ర పరికరాలు అందిస్తూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి రైతులకు అండగా ఉంటున్నారని ఎమ్మెల్యే డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. స్థానిక వ్యవసాయ మార్కెట్ కమిటీ ఆవరణలో రాయితీపై మంజూరైన వ్యవసాయ యంత్ర పరికరాలను శుక్రవారం ఆయన రైతులకు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతుల సంక్షేమానికి ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి కృషి చేస్తున్నారన్నారు. అకాల వర్షాలు, ప్రకృతి విపత్తులతో పంట నష్ట పోతున్న రైతులకు సైతం నష్టపరిహారం అందిస్తూ రైతు కుటుంబాలనకు భరోసా కల్పిస్తున్నారని కొనియాడారు. గతంలో ఎన్నడూ లేని విధంగా పెద్ద ఎత్తున రైతులకు వ్యవసాయ యంత్ర పరికరాలను అందిస్తున్నట్లు గుర్తు చేశారు. మండలంలోని అడవిరావులపాడు గ్రామానికి చెందిన వైఎస్ జగన్ సీహెచ్‌సీ గ్రూపునకు మంజూరైన రూ.11.08 లక్షల విలువ కలిగిన యంత్ర పరికరాలను అందజేశామని చెప్పారు. ప్రభుత్వ పథకాలను రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఏఎంసీ చైర్మన్ మహ్మద్ మస్తాన్, నాయకులు నల్లమల్లి మురళి, పాములపాటి రమేష్, గుడివాడ సాంబశివరావు, తానూరి రాము, పాకాలపాటి కృష్ణ, దాసు, చిరుమామిళ్ల చైతన్యకుమార్, బండారు వెంకట్రావ్, వ్యవసాయాధికారి ఖాశీం, పలువురు నాయకులు, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా విశ్వనాథం శత జయంతి



విశ్వనాథం విగ్రహానికి నివాళులర్పిస్తున్న సామినేని, మున్సిపల్ చైర్మన్, పార్టీ నాయకులు

జగ్గయ్యపేట అర్బన్: పట్టణ ప్రథమ సర్పంచ్, ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే సామినేని ఉదయభాను తండ్రి విశ్వనాథం శత జయంతి పట్టణంలో శుక్రవారం ఆయన అభిమానులు, వైఎస్సార్ సీపీ శ్రేణుల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ముందుగా ఎమ్మెల్యే ఉదయభాను నివాసంలో జరిగిన కార్యక్రమంలో విశ్వనాథం చిత్రపటానికి ఆయన మనుమడు, పార్టీ యువ నేత సామినేని వెంకటకృష్ణ ప్రసాద్, పలువురు పార్టీ నాయకులు, కార్యకర్తలు పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి ఆర్టీసీ బస్టాండ్ వద్ద పార్కులో ఉన్న విశ్వనాథం కాంస్య విగ్రహానికి, శ్రీమతి గెంటేల శకుంతలమ్మ (ఎస్‌జీఎస్) కళాశాల ఆవరణలో ఉన్న విశ్వనాథం కాంస్య విగ్రహానికి సామినేని, పార్టీ నాయకులు, కార్యకర్తలు, ఎస్‌జీఎస్ కళాశాల పాలకవర్గ సభ్యులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ జగ్గయ్యపేట పట్టణాన్ని ముందుగా పంచాయతీ చేసి 24 ఏళ్లు సర్పంచ్‌గా పనిచేసి అనేక సంస్కరణలు చేపట్టి ముందు తరాలకు బాటలు వేశారన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్మన్ రంగాపురం రాఘవేంద్ర, వైస్ చైర్మన్ తుమ్మల ప్రభాకర్, మున్సిపల్ మాజీ చైర్మన్ ముత్యాల వెంకటాచలం, పార్టీ పట్టణ అధ్యక్షుడు ఆకుల శ్రీకాంత్, యువజన విభాగం అధ్యక్షుడు ఆవాల భవానీప్రసాద్, పార్టీ కార్మిక, వాణిజ్య విభాగాల అధ్యక్షులు గోగుల వెంకయ్య, చారుగుండ్ల కొండ, న్యాయవాదులు సామినేని రాము, సత్యశ్రీనివాస్, కౌన్సిలర్లు గింజుపల్లి వెంకట్రావు, ఖాదర్‌బాబు, పట్టణ సచివాలయాల కన్వీనర్ తుమ్మేపల్లి నరేంద్ర, శ్రీకృష్ణదేవరాయ సేవాసమితి (కాపు సంఘం) అధ్యక్షుడు యలమంచి రాజేంద్ర, ప్రతినిధులు చిట్టిప్రోలు సత్యనారాయణ, గోగుశెట్టి మహేష్, సలాది సూరిబాబు, ఆస్పత్రి అభివృద్ధి కమిటీ సభ్యులు కఠారి హరిబాబు, నాయకులు తన్నీరు నాగేంద్ర, దువ్వల రామకృష్ణ, కాశి కిషోర్ తదితరులు పాల్గొన్నారు. కఠారి బ్రదర్స్ ఆధ్వర్యంలో సుమారు 2 వేల మందికి మజ్జిగ పాకెట్లు పంపిణీ చేశారు. కఠారి హరిబాబు, కఠారి సూర్యనారాయణ పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన

- ఎమ్మెల్యే జగన్‌మోహనరావు
- దొడ్డదేవరపాడులో గడప గడపకు మన ప్రభుత్వం



దొడ్డదేవరపాడులో సంక్షేమ పథకాలు వివరిస్తున్న ఎమ్మెల్యే జగన్‌మోహనరావు

దొడ్డదేవరపాడు(వీరులపాడు): ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి అభివృద్ధి, సంక్షేమం రెండు కళ్లుగా పాలన సాగిస్తున్నారని శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్‌మోహనరావు పేర్కొన్నారు. మండలంలోని దొడ్డదేవరపాడు గ్రామంలో శుక్రవారం ఆయన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. గ్రామంలోని ప్రతి గడపకు వెళ్లి ప్రభుత్వ పథకాలను వివరించి, లబ్ధిదారులకు సమకూరిన పథకాల వివరాల బుక్‌లెట్‌ను అందజేశారు. ఈ సందర్భంగా జగన్‌మోహనరావు మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి గత ప్రభుత్వాల మాదిరిగా కాకుండా అన్ని వర్గాలకు మంచి జరిగేలా పారదర్శక పాలన సాగిస్తున్నారన్నారు. అర్హతే ప్రామాణికంగా సంక్షేమ పథకాలు అందిస్తున్నారని తెలిపారు. దివంగత సీఎం వైఎస్ రాజశేఖర్‌రెడ్డి నిరుపేదలకు సంక్షేమ పథకాలు అందించి జన హృదయ నేతగా నిలిచారని చెప్పారు. ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి సైతం మహానేత చూపిన బాటలో నడుచుకుంటూ మంచి పేరు తెచ్చుకుంటున్నారని గుర్తు చేశారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలన్నీ అమలు చేశారని కొనియాడారు. మంచి చేస్తున్న ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి, ప్రభుత్వానికి అండగా నిలిచి రానున్న ఎన్నికల్లో ఆశీర్వదించాలని కోరారు. ఎంపీపీ కోటేరు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల కన్వీనర్ ఆవుల రమేష్‌బాబు, జెడ్పీటీసీ సభ్యురాలు అమర్లపూడి కీర్తి సౌజన్య, జెడ్పీటీసీ మాజీ సభ్యుడు కోటేరు ముత్తారెడ్డి, షేక్ కార్పొరేషన్ డైరెక్టర్ షహనాజ్ బేగం, సర్పంచ్ చెండ్యాల రామకృష్ణ, ఎంపీటీసీ సభ్యుడు తోట నారాయణరావు, పలువురు నాయకులు, వలంటీర్‌లు, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.

పుచ్చలపల్లి సుందరయ్యకు నివాళి



మజ్జిగ పంపిణీ చేస్తున్న సీపీఎం నేత ఎన్‌సీహెచ్.శ్రీనివాసరావు తదితరులు

నందిగామ: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతి కార్యక్రమాన్ని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం నందిగామలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పార్టీ నాయకులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఆయన చేసిన సేవలను కొనియాడారు. నేటి యువత ఆయనను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు సైదులు, కటారపు గోపాల్ సయ్యద్ ఖాసిం తదితరులు పాల్గొన్నారు.

జగ్గయ్యపేట అర్బన్: కామ్రేడ్ పుచ్చలపల్లి సుందరయ్య వర్ధంతిని పట్టణంలో శుక్రవారం సీపీఎం ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ సందర్భంగా స్థానిక పాత మున్సిపల్ కార్యాలయం కూడలిలో పుచ్చపల్లి సుందరయ్య చిత్రపటానికి సీపీఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎన్‌సీహెచ్. శ్రీనివాసరావు నివాళులర్పించారు. అనంతరం మజ్జిగ పంపిణీ చేశారు. ఆ పార్టీ నాయకులు కోట కృష్ణ, దంతాల వెంకటేశ్వర్లు, దాసరి నాగేశ్వరరావు, గౌస్‌మియా, రామనాథం, రాంప్రసాద్, కె.శ్రీనివాసరావు, మున్సిపల్ కార్మికులు గుణ, ఎలకమ్మ, రంగమ్మ పాల్గొన్నారు.

'సుకన్య సమృద్ధి యోజన'ను సద్వినియోగం చేసుకోవాలి



కొమ్మూరులో చిన్నారి భవితపై ప్రతిజ్ఞ చేస్తున్న ఆడపిల్లల తల్లిదండ్రులు

ఆగిరిపల్లి: కేంద్ర ప్రభుత్వం తపాల కార్యాలయాల ద్వారా ప్రవేశ పెట్టిన సుకన్య సమృద్ధి యోజన పథకాన్ని ఆడపిల్లల తల్లిదండ్రులు సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ సూపర్‌వైజర్ బి.శివకుమారి సూచించారు. ఆగిరిపల్లి మండలం కొమ్మూరులో సబ్ కలెక్టర్ ఆదేశాల మేరకు చిన్నారి భవిత కార్యక్రమం నిర్వహించారు. ఆడ పిల్లలకు బాల్య వివాహాలు, వరకట్నాలు ప్రోత్సహించడం వల్ల వారి బంగారు భవిష్యత్‌కు అడ్డుకట్ట వేసిన వారవుతారని శివకుమారి వివరించారు. ఈ సందర్భంగా ఆడపిల్లల తల్లిదండ్రులతో చిన్నారి భవిత కార్యక్రమ ఉద్దేశంపై ప్రతిజ్ఞ చేయించారు. సుకన్య సమృద్ధి యోజన పథకంలో చేరి ఆడపిల్లల బంగారు భవిష్యత్‌కు బాటలు వేసుకోవాలని ఆమె సూచించారు. కార్యక్రమంలో సర్పంచ్ కోసూరి ఏసు, సూరవరం ఎంపీటీసీ సభ్యుడు పరసా కోటేశ్వరరావు పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

నందిగామ: పట్టణ పరిధిలోని పలు ప్రాంతాల్లో శనివారం నాలుగు గంటలపాటు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆ శాఖ ఏఈ దిబ్బయ్య శుక్రవారం రాత్రి ఒక ప్రకటనలో తెలిపారు. నందిగామ పట్టణం తోపాటు పట్టణ శివారు అనాసాగరం సబ్ స్టేషన్ల పరిధిలో మరమ్మత్తుల నేపథ్యంలో ఉదయం 7 గంటల నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన తెలిపారు.

రాయితీపై జీలుగ విత్తనాల పంపిణీ

నందిగామ: మండలంలోని రామిరెడ్డిపల్లి రైతు భరోసా కేంద్రం ద్వారా శుక్రవారం రైతులకు రాయతీపై జీలుగ విత్తనాలను అందజేశారు. గ్రామానికి చెందిన పలువురు రైతులకు 50 శాతం రాయితీపై విత్తనాలను గ్రామ సర్పంచ్ పల్లె కంటి అరుణ కుమారి రైతులకు అందజేశారు. సహకార సంఘ అధ్యక్షుడు లగడపాటి వీరయ్య, పార్టీ నాయకులు వీరమాచినేని నాగమల్లేశ్వరరావు, పలువురు ఆర్.బి.కె సిబ్బంది పాల్గొన్నారు.


క్రికెట్ టోర్నమెంట్ ప్రారంభం

నందిగామ: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో పట్టణంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో రాజీవ్ గాంధీ స్మారక క్రికెట్ టోర్నమెంట్ ను శుక్రవారం ప్రారంభించారు. ఆ పార్టీ నాయకులు బి.కిరణ్, పాలేటి సతీష్ టవర్నమెంట్ ను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఆ పార్టీ నాయకులు ఆరిఫ్, శ్రీనివాస్, వజ్రయ్య, శ్యామ్ తదితరులు పాల్గొన్నారు.

రామాలయం స్థలం ఆక్రమణపై ఫిర్యాదు

హనుమాన్‌జంక్షన్ రూరల్: బాపులపాడు మండలం వీరవల్లిలో రామాలయం స్థలాన్ని తెలుగురైతు రాష్ట్ర కార్యదర్శి గుండపనేని ఉమావరప్రసాద్ ఆక్రమించారని ఆరోపిస్తూ దేవస్థానం కమిటీ సభ్యులు వీరవల్లి పోలీస్‌స్టేషన్‌లో శుక్రవారం ఫిర్యాదు చేశారు. గ్రామానికి చెందిన సగర్లు దాదాపు 20 ఏళ్ల క్రితం రామాలయం నిర్మించుకున్నారు. ఈ దేవస్థానానికి సరిహద్దు స్థలం కలిగిన టీడీపీ నేత గుండపనేని ఉమావరప్రసాద్ రామాలయం స్థలాన్ని ఆక్రమించేందుకు యత్నించటంతో ఆలయ కమిటీ సభ్యులు గతంలో కోర్టును ఆశ్రయించారు. ఈ నేపథ్యంలో ఉమావరప్రసాద్ శుక్రవారం మరోమారు రామాలయం స్థలాన్ని స్వాధీనం చేసుకుని, పశువులను కట్టివేయటంతో వివాదం చెలరేగింది. దీనిపై రామాలయం కమిటీ సభ్యులు గజ్జల గోపాలం, కగ్గా రమణ, నక్కా వరలక్ష్మి, కర్నాటి సామ్రాజ్యం, గజ్జెల వాణి వీరవల్లి తదితరులు ఎస్ఐ చిరంజీవికి ఫిర్యాదు చేశారు. కోర్టు తీర్పును పరిశీలించిన తర్వాత ఈ ఘటనపై చర్యలు తీసుకుంటామని ఎస్ఐ చెప్పారు.

రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు



గాయపడిన వ్యక్తిని తరలిస్తున్న పోలీసులు

పెనుగంచిప్రోలు: రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి తీవ్రగాయాలైన ఘటన మండల పరిధిలోని ముండ్లపాడు రోడ్డులో శుక్రవారం చోటు చేసుకుంది. సేకరించిన వివరాల ప్రకారం.. వత్సవాయి మండలం కంభంపాడు గ్రామానికి చెందిన బొంత ఐతంరాజు ముండ్లపాడు నుంచి పెనుగంచిప్రోలు వైపు బైక్‌పై వస్తూ అదుపుతప్పి కింద పడిపోయాడు. తీవ్రంగా గాయపడిన అతనిని మొదట పెనుగంచిప్రోలు ప్రాథమిక ఆరోగ్యకేంద్రానికి అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 వాహనంలో విజయవాడ తరలించారు. స్థానిక పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి

నందిగామ: జాతీయ రహదారిపై నందిగామ పట్టణంలో గురువారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో గాయపడిన వ్యక్తి మృతి చెందాడు. పోలీసులు తెలిపిన సమాచారం ప్రకారం.. పట్టణంలోని ముక్కపాటి కాలనీకి చెందిన బి.ప్రభుదాస్ (54) రాత్రి సమయంలో ఇంటి నుంచి బస్టాండ్ వైపు జాతీయ రహదారిపై నడిచి వస్తున్న సందర్భంలో మధిర రోడ్డు వద్దకు రాగానే వెనక నుంచి వచ్చిన బైక్ ఢీ కొంది. ఈ ప్రమాదంలో గాయపడిన ప్రభుదాస్ నందిగామ ప్రభుత్వాసుపత్రిలో చికిత్స పొందుతూ మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామన్నారు.

గురుకుల పాఠశాలలో సీట్ల భర్తీకి దరఖాస్తులు

కొండపల్లి(ఇబ్రహీంపట్నం): కొండపల్లిలోని ఆంధ్రప్రదేశ్ గిరిజన సంక్షేమ గురుకుల పాఠశాలలో 2023–24 విద్యా ఏడాదికి దరఖాస్తులు కోరుతున్నట్లు ప్రిన్సిపాల్ కె.శైలజ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. 3వ తరగతిలో 40 సీట్లు, 4 నుంచి 6వ తరగతిలో ఖాళీగా ఉన్న సీట్లు ఎస్టీ బాలికల తో భర్తీ చేస్తామని పేర్కొన్నారు. ఈ నెల 30వ తేదీ వరకు గడువు ఉందని తెలిపారు. 3 నుంచి టెన్త్‌క్లాస్ వరకు అన్ని సదుపాయాలతో అనుభవం కలిగిన ఉపాధ్యాయులతో విద్యా బోధన జరుగుతుందని తెలిపారు. వివరాలకు 83339 25169లో సంప్రదించాలని పేర్కొన్నారు.



విజయవాడలో వలంటీర్లకు అవార్డులు ఇచ్చే కార్యక్రమానికి వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ఎంఎల్‌సీ అరుణకుమార్



వలంటీర్లకు అవార్డులు ఇచ్చే కార్యక్రమానికి విజయవాడ వచ్చిన సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డికి స్వాగతం పలుకుతున్న ప్రభుత్వ విప్ ఉదయభాను

విజ్ఞానాన్ని వెలికి తీసేందుకే గ్రంథాలయాలు



శిక్షణశిబిరంలో ఆటలు ఆడుతున్న విద్యార్థులు



బొకేల తయారీలో శిక్షణ పొందుతున్న విద్యార్థులు

పెనుగంచిప్రోలు: విద్యార్థుల్లో దాగి ఉన్న సృజనాత్మకతను వెలికితీసి విజ్ఞానాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం వేసవి శిక్షణా శిబిరాలను ఏర్పాటు చేసిందని పెనుగంచిప్రోలు, అనిగండ్లపాడు గ్రంథాలయాధికారులు ఇంజం మధు, మధుబాబు అన్నారు. వేసవి శిక్షణా తరగతుల్లో భాగంగా శుక్రవారం గ్రంథాలయాల్లో విద్యార్థులతో కథలు చదివించటం, నీతి వ్యాఖ్యాలు చెప్పించటం వంటి కార్యక్రమాలు నిర్వహించారు. వివిధ అంశాల్లో పోటీలు నిర్వహించి బహుమతులు అందజేశారు.

వత్సవాయి : స్థానిక గ్రేడ్–3 గ్రంథాలయంలో చిన్నారులకు శుక్రవారం పాడుపు, నీతి కథలతో పాటు ఇంగ్లిషు, లెక్కల సబ్జెక్టులపై అవగాహన కల్పించారు. ప్రభుత్వ ఉపాధ్యాయుడు చల్లా వెంకటప్పారెడ్డి, ఉప్పుగండ్ల రామారావు విద్యార్థులు సందేహాలు నివృత్తి చేశారు. గ్రంథాలయ విశిష్టత గురించి అధికారి ఏ.ప్రభాకరరావు వివరించారు.

జగ్గయ్యపేట అర్బన్: పట్టణంలోని జిల్లా గ్రేడ్–1 శాఖ గ్రంథాలయంలో నిర్వహిస్తున్న వేసవి విజ్ఞాన శిబిరం శుక్రవారం కొనసాగింది. ఉపాధ్యాయులు విద్యార్థులతో పుస్తక పఠనం చేయించారు. అనంతరం కలర్ పేపర్‌లతో పూల బొకేలు తయారు చేయడం బీడీసీ మల్లిక విద్యార్థులకు నేర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయుడు డి.నాగేశ్వరరావు, గ్రంథాలయాధికారి ఎ.ప్రభ, సిబ్బంది శ్యామల, సత్యావతి, విద్యార్థులు, పాఠకులు పాల్గొన్నారు.

అవార్డులు అందుకున్న వలంటీర్లు

కంచికచర్ల(వీరులపాడు): మండలంలో ఇద్దరు వలంటీర్లు సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అవార్డులు అందుకున్నారు. విధి నిర్వహణలో అత్యుత్తమ సేవలందించి, సంక్షేమ పథకాలను నేరుగా ప్రజలకు అందించటంలో క్రియాశీలక పాత్ర పోషించినందుకు ఈ అవార్డులు దక్కాయి. కంచికచర్ల–1 సచివాలయానికి చెందిన వలంటీర్‌లు నాగలక్ష్మి, రాధారాణి ప్రభుత్వం అందిస్తున్న విశిష్ట సేవా పురస్కారాలు శుక్రవారం ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చేతుల మీదుగా అందుకున్నారు. నాగలక్ష్మికి సేవా వజ్ర అవార్డుతో పాటు రూ. 30 వేల నగదు, రాధారాణికి సేవారత్న అవార్డుతో పాటు రూ.20 వేల నగదు బహుమతిని స్వీకరించారు. అవార్డులు అందుకున్న వలంటీర్లను గ్రామ కార్యదర్శి కనగాల రవికుమార్ అభినందించారు. వారు మాట్లాడుతూ ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డి వలంటీర్ వ్యవస్థను ఏర్పాటు చేసి సేవ చేసే భాగ్యం కల్పించటం వలనే తాము అవార్డులు గెలుచుకున్నామని తెలిపారు. అవార్డుల రూపంలో ప్రభుత్వం నుంచి మంచి గుర్తింపు లభించటం సంతోషంగా ఉందన్నారు. తమకు తోడ్పాటు సహకారం అందించిన శాసనసభ్యుడు డాక్టర్ మొండితోక జగన్ మోహనరావు, శాసన మండలి సభ్యుడు డాక్టర్ మొండితోక అరుణకుమార్, ఎంపీడీవో బాలశంకరరావులకు కృతజ్ఞతలు తెలిపారు.